# కోపించలేని కళ్యాణి

ఇచ్ఛాపురపు జగన్నాథరావు



కళ్యాణికి కోపం వచ్చింది.

ఆమెకి కొంత కాలంనించి తరుచు కోపం వస్తోంది.

ఉద్యోగం చెయ్యకపోతే గడవని పరిస్థితి మీద ఆమెకి ముందుగా కోపం వొచ్చింది. పోతూపోతూ నాన్న ఆ చిన్న ఇల్లూ దానిమీద అంత చిన్నదిగాని అప్పూ వొదిలి వెళ్ళిపోయాడు అయన అమ్మ పేరున వొదిలిన చిన్న భూమి అమ్మేం అనిపించి ముగ్గురన్నయ్యలూ ఆ ఇంటికి తణఖా చెరనించి విడిపించేరు. ఆ పుణ్యకారణంతో వాళ్లు నాన్నకి అమ్మకి తనకి ఆ ఊరికీ తమ పాత జీవితాలకీ బాకీ తీర్చి తమ తమ ఉద్యోగాలు చేసుకుందుకూ తమ భార్యలనీ పిల్లలనీ జాగ్రత్తగా చూసుకుని సుఖపెట్టేందుకూ వెళ్ళిపోయారు. వాళ్ళ నాన్న అంతక్రియ లయేయనిపించడమే పదివేలనుకున్న అమ్మకి ఆ ఇల్లు మళ్ళీ గ్రహణం విడిచి తమ దవడం ఇరవైవేలలాగా ఉంది. కాని అదంతా ఆలోచనల్లోనే-ఉండడానికి ఇల్లు ఉందిగాని బతికి ఉండడానికి నగదు ఏమీ లేదు. నాన్న జ్ఞాపకార్థం ఒక్కొక్కళ్లు ఆయన అమ్మకి చేయించిన నగల్లో వీలైనన్ని పట్టికెడదామని ఎంత ప్రయత్నించారో! నలుగురూ ఏమంటారోనని అమ్మ నగలు పెట్టుకోకపోవడం మంచిదయింది. వాళ్లెవరికీ కనిపించకుండా అతి నేర్పుగా వాటిని దాచడం ఇంకా మంచిదైంది. అవి బరువులోనూ స్వరూపాలలోనూ చాలా తక్కువ అవడంవల్ల ఆ దాపరికం అంత కష్టమైనది కాదు. కాని తల్లీ చెల్లెళ్ల భవిష్యత్తు వారం దూరంకూడా చూడలేని అన్నయ్యలవీ వొదినలవీ బంగారం నగలనేసరికి ఎక్సరే కళ్లలాగ పని చేస్తాయి. అందుకే చెత్తకాగితాల మధ్యన చింకిరి బస్తాలో తలదాచుకున్న వెండి గిన్ని పెద్దన్నయ్య పెరట్లోకి వెళ్ళి మళ్లీ బయటికి రాలేదు. మా చిన్న పాపకి ఆ గిన్నితో పాలు పడితే ఇష్టంగా తాగుతుందిలే! మా వెండి గిన్ని తెచ్చి ఇక్కడ పడేస్తాను. వాళ్లతో అనకులే. అసలే అందరమూ దుఃఖంలో ఉన్నాము.... అన్నాడు వేదాంతం చెప్తూన్న పెద్దన్న.

ఆ తరవాత ఉద్యోగం కోసం పడ్డ పాట్లు తలుచుకుంటే కళ్యాణికి కోపం.

షార్ట్‌హేండ్ టైపూ నేర్చుకుంది జీవితం గడవదా అనుకుంది. కాని అది అంత సులువు కాదని త్వరలోనే తెలుసుకుంది. అనుభవం ఉందా? అని మొదటి ప్రశ్న. పని లేకుండా అనుభవం ఎలా ఒస్తుందీ అని అనుకుని ఆ ప్రశ్న వెయ్యలేక తల ఊపేది కళ్యాణి. ఎలా అయితేనేం చివరికి ఉద్యోగం వొచ్చింది. కాని అది దూరంగా వొచ్చింది. హెడాఫీసు ఈ ఊళ్లోనే ఉన్నా వాళ్ళు బ్రాంచిలో వేశారు. ఇల్లు వొదిలి రానంది అమ్మ. అసికేవలం సెంటిమెంటుకాదు. ఇల్లు అద్దెకిస్తే రెండు నెలలు దాటి అద్దె ఇవ్వరు. ఇల్లు మాది పొమ్మంటే దిక్కు ఉండదు అదీ ఆవిడ బాధ నిజమే.

పది నెలలు అక్కడ భయంకర జీవితం. ఒంటరిగా. అందరూ చూసేవారే. ఆశగా. అవమానంగా. వెకిలిగా కొంత కాలానికి ఆ పశువులమీద కోపం రావడం మానేసింది కళ్యాణికి. ఉద్యోగం చెయ్యలేనిదీ వదులుకోలేనిదీ పరిస్థితి. జీవితం అంటే రానున్న సంవత్సరాలు కాదు. ఈ రోజు ఈ గంట అనే పరిస్థితికి వొచ్చింది కళ్యాణి. అందరి మధ్య తిరుగుతూన్నా భరించలేని ఒంటరి

తనం. ఆ అద్దెగదిలో ఊపిరి ఆడేదికాదు. ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన ఒకటి రెండు సార్లు వొచ్చింది ఆమెకి. అలాటి పని అమ్మకి బాధ అని మాత్రమే కాదు ఆమె అలాటి ప్రయత్నాలు చెయ్యకపోడానికి కారణం. ఇది మాత్రం ఒక రకం ఆత్మహత్యే కదా అనుకుంది. తనని ప్రేమించేవాళ్లూ. తన కోసం ఎదురు చూసేవాళ్లూ, బాధపడేవారూ దగ్గరగా ఎవరూ లేరు. చక్కటి వయసులో ఉన్నా కలలు కనే కాలంలో ఉన్నా తనని చూసి వెకిలిగా నవ్వేవాళ్లూ తన వెనకాల తనని బహుశా వెక్కిరించి కథలు చెప్పుకునేవాళ్ళూ ఉన్నారు కాని చిరునవ్వుతో పలకరించినవాళ్లు లేరు. ఆప్యాయంగా ఒక్కరు పలకరించి ఎలా ఉన్నావని మనసారా అడిగితే వాళ్ళకోసం ఎవరైనా సరే-కళ్యాణి తన జీవితాన్ని కర్పూరం చేసి హారతిగా ఇచ్చి ఉండేది. అలాటి యోగ్యులెవరూ ఆమె జీవితంలోకి రాలేదు. అక్కడ అమ్మ తన కోసం ఏడుస్తూ రోజులు గడుపుతూ ఉంటుంది. ఆమె ఏడుపు కళ్యాణి బాధలని తలచుకుని కాదు. ఆ పిల్లకి పెళ్ళి అవలేదనీ, ఏ వయసుకాముచ్చట తీరలేదనీని. వెర్రితల్లి.





కళ్యాణికి కన్నీళ్ళు సుళువుగా రావు.

ఎవరికీ చెప్పలేనివీ తరుచు తనకే తెలియనివీ బాధల్ని మింగేస్తూ సంవత్సరం అలాగ గడిపింది ఆమె. ఈ మధ్యలో తన ఊరికి ట్రాన్స్ఫరు కోసం ఎన్ని ప్రయత్నాలైనా చేసింది.

'మీ దరఖాస్తులన్నీ పంపిస్తూనే ఉన్నా నమ్మా....ఇవన్నీ దేవుడికి చేసే ప్రార్థనల్లాటివి. అవి సరిగ్గా ఉన్నాయో లేదో అందేయో లేదో అందితే భగవంతుడి దృష్టిలోకి వొచ్చాయో లేదో వొస్తే ఆయన గారు ఏమి నిర్ణయం చేశారో చేస్తే అది మనదాకా ఎప్పుడు వొస్తుందో అసలు రాదో ఎవరు చెప్పగలరమ్మా! చూడండీ మీరు పనిమీద మనసు లగ్నం చేసుకోండి లోకల్ సేల్స్ గ్రూప్పులో హోల్ సేల్ రిపోర్టులూ ఇంకా రాలేదు. అని టైపు చేసి తెండి.

ఒక్క తప్పుకూడా ఉండకూడదు సుమా! చక్కగా చేసేస్తే ఆరు కాకుండా ఇంటి కెళ్ళిపోవచ్చు....'

"ఈ ఆడపిల్ల లింతేనోయ్! ఉద్యోగాలు కావాలి. సమాన హక్కులు కావాలి, కానీ నా సొంత ఊరు వొదిలి వెళ్ళరు. మనమంతా సొంత ఊరిలోనే ఉన్నామా? హాయిగా పెళ్లి చేసుకుని సంసారంచేస్తూ వాడిని సుఖపెట్టక ఎందుకీ బాధలు?" అని అన్యాపదేశం లాటి ఉపన్యాసాలు కళ్యాణి తరుచు వినేది. మొదట ఆమెకి చాలా కోపం వొచ్చేది. కాని క్రమక్రమంగా కోపాన్ని జీర్ణంచేసుకుని ఆ మాటలు వినిపించుకోడం మానేసింది.

ఆఫీసులో అందరికీ ఫేవరేట్ కళ. ఆమె గురించి కళ్యాణి చాలా చాలా విన్నది. కాని వాటిని గురించి పట్టించుకోలేదు. కళ లిప్‌స్టిక్ వాడినా ఫ్రెండుతో సినిమాకి వెళ్ళినా ఆమె ఇష్టం. కళ తరుచు కళ్యాణిని పలకరించేది. కొంచెం అయినా ఎంకరేజిమెంటు ఇచ్చేది.

ఒకసారి కళ్యాణి సెలవు పెట్టి ఇంటికి వెడుతూంటే కళ ఆమెకి సానుభూతి చెప్పి హెడాఫీసులో ప్రయత్నించమని సలహా ఇచ్చింది. వెంటనే, "అక్కడ ఏం చెయ్యాలన్నా రమేష్‌ని కలవక తప్పదులే.. నీకు కుదరదు" అంది.

"ఏం?—ఒకసారి వెడితే పని అవుతుందేమో" అంది కళ్యాణి ఆశగా.

"చూడ్డానికి బాగుంటావు నువ్వు! అతను పేరుకి రాముడు గాని చరిత్రకి కృష్ణుడులే....నీలాటి వాళ్లు అతని కళ్ళబడ్డం మంచిది కాదు. నువ్వే ఆలోచించుకో" అంది కళ.

ఆలోచించి రమేష్‌ని కలవడానికే నిర్ణయించుకుని రెయిలెక్కింది కళ్యాణి. కాని ఇంటికి చేరేసరికి అమ్మ మరీ నీరసంగా ఉంది. నాలుగు రోజుల నించి జ్వరంట. కళ్యాణి ఉన్న వారం రోజులూ ఆవిడ మంచం దిగలేకపోయింది. సెలవు పొడిగించడం అనేది జరగని పని. ఈ టెంపరరీ ఉద్యోగంలో సెలవు దొరకడమే గగనం. ఆ కారణాలవల్లనే ఆమె రమేష్‌ని కలుసుకోలేకపోయింది. తిరిగి వొచ్చేసింది.

ఆమెకి కోపం రావడం మానలేదు.

కాని దానిని దిగమింగుకోవడం నేర్చుకుంది. అదీ అలవాటైపోయింది.



అనుకోని ఒక రోజున ఆమెకి హెడాఫీసుకి బదిలీ చేస్తూ ఆర్డర్లు వొచ్చాయి. రిలీవ్ మాట అప్పుడే ఆలో చించడం కుదరదని మేనేజర్ చెప్తే ఆమెకి కోపం వొచ్చింది. దేవుడిచ్చినా పూజారి ఇవ్వడు అనుకుంది.

"నువ్వు బాధపడకు....రాత్రి బండికి వెళ్ళే ప్రయత్నంలో ఉండు" అంది కళ.

"ఆ మేనేజరు...." అంది కళ్యాణి.

"అతని మాట నేను చూసుకుంటాను గదా!" అంది కళ నవ్వుతూ. అలా నవ్వుతూనే మేనేజర్ కేబిన్‌లోకి వెళ్ళింది. ఆమె వెంట కాఫీలు వెళ్లాయి. అరగంట తరవాత రిలీవ్ ఆర్డరు చేతిలోకి వొచ్చింది.

చాలాకాలం తరవాత కళ్యాణికి ఆనందంగా ఉంది. ఎలా ఆనంద పడాలో ఆమె మరచిపోయింది.

హెడాఫీసులో చేరుతూనే సుమిత్రని కలుసుకుంది. ఆవిడ ఎకౌంట్స్‌లో పని చేస్తూంది.

సుమిత్ర తన చిన్ననాటి నేస్తానికి మనసారా స్వాగతం చెప్పింది. క్షేమ సమాచారాలు అడిగింది. ఆ సాయంత్రమే తన ఇంటికి తీసికెళ్ళింది.

"నీ పోస్టింగ్ మాట ఏమిటి?" అని అడిగింది.

"రేపటికి ఇస్తారట."

"ఎక్కడా?"

"తెలీదు."

"ఎక్కడైనా సరే ఫరవాలేదు గాని రమేష్ దగ్గిర కాకుండా చూసుకో" అని సలహా ఇచ్చింది సుమిత్ర.

"ఏం?" అంది కళ్యాణి.

"అతనో....వేటగాడులే. నువ్వు వేగ లేవు. అక్కడ వొద్దని చెప్పు." అంది సుమిత్ర.

"అలాగే..థేంక్స్!" అంది కళ్యాణి

కాని ఆమె ఎవరినీ ఆ విషయంలో అభ్యర్థించదలుచుకోలేదు.

"రేపే వెళ్ళి పోస్టింగ్ సెక్షన్‌లో చెప్పు," అంది సుమిత్ర.

కళ్యాణి చెప్పలేదు. ఎవరినైనా ఏదయినా అడగడమంటే ఆమెకి అసలు పడదు. అదికాక ఈ సంవత్సరం చేసిన ఉద్యోగంలో ఆఫీసు పనికన్నా మను షులతో వ్యవహరించడమే ఎక్కువగా నేర్చుకుంది కళ్యాణి. మగవాళ్ళంటే ఆమెకి భయం లేదు. రమేష్ అంటే అసల్లేదు-చప్పుడు చెయ్యడానికి రెండు చేతులు కావాలి గదా?

కళ్యాణికి రమేష్ దగ్గర పోస్టింగ్ ఆ మర్నాడే వొచ్చింది.

సుమిత్ర ఓదార్చి ధైర్యం చెప్పింది. యూనియన్‌లో ఆమె సహాయ కార్య దర్శిట అవసరమైతే సాయం చేస్తానంది.

తల ఊపి కళ్యాణి వెళ్ళి రమేష్‌ని కలుసుకుని తన జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చింది. అతన్ని చూసి ఆమె కొంచెం ఆశ్చర్యపడింది. మనిషి చాలా స్మార్ట్‌గా ఉన్నాడు. నల్లగా లేడు. బట్టతల లేదు. బయటికి వచ్చే దంతాలూ లేవు.

"గుడ్. వెల్కం. ఇక్కడ ఖాళీలేక మీ ట్రాన్స్ఫర్ త్వరగా ఆర్డరు చెయ్య లేదు. నీరజ రిజయిన్ చెయ్యడంతో ఇక్కడ ఖాళీ రావడం....మీకు మంచి దైంది." అన్నాడు రమేష్.

"థేంక్స్" అంది కళ్యాణి.

"చాలా వర్కు ఉంది. చేతితో రాసి రాసి విసుగు పుట్టింది - రెండు అర్జంటు ఉత్తరాలున్నాయి. టేక్‌డౌన్" అన్నాడు రమేష్.

కళ్యాణికి సంవత్సరం నించి టైపు పనేగాని షార్ట్‌హేండ్ లేదు.

అందుకే ఆమె టైపు చేసిన దానిలో ఒప్పులకన్న తప్పు లెక్కువ ఉన్నాయి. అరగంట డిక్టేషన్ మేటరు సరిదిద్దేసరికి అతనికి నలభై నిమిషాలు పట్టింది. ఓపికగా అంతా సరిదిద్ది ఇచ్చేడు. ఏమీ అనలేదు-అది అతని టెక్నిక్ కాబోలు అనుకుంది కళ్యాణి.

"సారీ. అక్కడ అసలు డిక్టేషన్ లేదు...." అంది.

"నాకు తెలుసును...."

"పది రోజుల్లో-అలవాటు పడతాను."

"నేచురల్లీ. ఇవి త్వరగా తీసుకు రండి."

తనని పంపడానికి అతను తొందర పడుతున్నాడు అనుకుంది కళ్యాణి. అదీ ఆ టెక్నిక్‌లో ఒక భాగమే అనుకుంది.

ఫెయిర్ కాపీలు ప్యూన్ ద్వారా పంపించింది.

రెండు నిమిషాలలో అవి తిరిగి వొచ్చేయి. నాలుగు పేజీలలో ఆరు తప్పులు జాగ్రత్తగా దిద్ది సంతకం పెట్టి పంపేడు రమేష్. అయినా వాటిని మళ్ళీ టైపుచేసి పట్టికెళ్ళింది.

"థేంక్స్" అని చెప్పి సంతకం చేసి ఇచ్చి "ఈ రిపోర్టు నాలుగు కాపీలు కావాలి. చేత్తో రాశాను. నా దస్తూరీ బోధ పడకపోతే అడగండి. సాయంత్రం లోపున కావాలి" అంటూ రమేష్ మరి కొన్ని కాగితాలు ఇచ్చాడు. "ఇంకో రెండు పేజీలు రాయాలి. మీరు టైపు చేస్తూఉండండి. నేను రాసి పంపుతాను" అన్నాడు.


మాట్లాడకుండా వెళ్ళి టైపింగ్ మొదలుపెట్టింది కళ్యాణి. రమేష్ చాలా చూపెడుతున్నాడని ఆమెకి తెలుసును. అందుకు సంతోషించాలో బాధపడాలో ఆమెకి బోధపడలేదు. ఆలోచించడానికి వ్యవధీ లేదు. అతని దస్తూరీ బాగానే ఉన్నా చాలా మాటలు స్పష్టంగా లేవు. మాట కొకసారి చొప్పున వెళ్ళడం కళ్యాణికి నచ్చలేదు. అంతా చదివి అయిష్టంగానే అతని గదిలోకి వెళ్ళి ఆ మాటలు పెన్సిల్‌తో రాసుకుంది "సారీ! నా దస్తూరీ అంత అధ్వానంగా ఉంటుం దనుకోలేదు" అన్నాడు రమేష్ చిరు నవ్వుతో.

ఆ మాటల్లో ఉన్న ధ్వని కళ్యాణికి బోధపడింది.

చేతిరాత ఎంత అస్పష్టంగా ఉన్నా ఆకళింపు చేసుకోవడం తన విధి అని ఆమెకి తెలుసును. అతని చిరునవ్వులో ఏముందో కూడా ఆమెకి తెలుసును

అదంతా టెక్నిక్....

లంచ్‌కి లేవకుండా పని చేద్దామనుకుంది. కాని సుమిత్ర ఊరుకోలేదు. "రెండు రోజుల పని అరపూటలో అవదులే...." అంది.




కాని ఆ రిపోర్టు అర్జంటుగా ఢిల్లీ పంపాలని కళ్యాణికి తెలుసును. అయినా అలక్ష్యం అవనీ-ఆ మనిషికి ఏమయితే నాకేం? అనుకుని వెళ్ళి అరగంట అలశ్యంగా వొచ్చింది.

సాయంత్రం ఆరుకి కాని ముగియలేదు. అతనికి ఇవ్వడానికి వెళ్ళింది. అతను రాస్తున్నాడు. "ఇవన్నీ రేపటికి... మీకు హెడాఫీసు అంటే త్వరగానే అలసట కొచ్చేలాగ ఉంది!" అన్నాడు రాసిపెట్టిన కాగితాలు చూపెడుతూ.

కళ్యాణి ఇల్లు చేరేసరికి ఏడు.

ఓవర్ టైంకి ఆర్డరు లేకుండా ఆమె పనిచేసినందుకు యూనియన్ వాళ్లు ఆ మర్నాడు ఆమెని విమర్శించేరు.

ఏం సంజాయిషీ ఇవ్వాలో ఆమెకి తెలియలేదు. కాని ఆ మధ్యాహ్నం రమేష్ సంతకంతో ఓ.టి. స్లిప్ ఉంది.

ఇలాగే రెండు నెలలు గడిచాయి.

కళ్యాణి తనను తానూ రమేష్‌నీ అతి జాగ్రత్తగా గమనించింది. అతను ఏ వెకిలిచేష్ట చేసినా అల్లరిచెయ్యాలని ఆమెకి మొదట వొచ్చిన ఆలోచన అలాగే ఉంది. కాని ఆ ఆలోచన పటుత్వం తగ్గిపోయింది. రమేష్ చాలా జాగ్రత్తగా ఉన్నాడు. మర్యాద విషయంలో గాని ప్రవర్తనలో గాని అతన్ని తప్పుపట్టడం కష్టమైపోయింది.

ఆమె కాగితాలు ఇచ్చినా తీసుకున్నా అతను వాటిని టేబిల్‌మీద పెట్టేవాడు. ఈ రెండు నెలలలోనూ అతనికీ ఆమెకీ మధ్య తమ తమ పనులకి సంబంధించినవి తప్పితే మరో మాట అసలు రాలేదు. ఆమె సాయంత్రాలు షార్ట్‌హేండ్ స్కూలు చేరి తన పని బాగా చెయ్యడం మొదలుపెట్టేక రమేష్ చాలా సంతోషంగా ఆమె అభివృద్ధిని ప్రశంసించేడు. "మీరు చాలా బాగా చేస్తున్నారు. తప్పులు పట్టడం కష్టంగా ఉంది. నా చేతులకి రెస్ట్ దొరికింది-థాంక్స్!" అన్న మనిషిని ఏమని విమర్శించడం?

"ఏమిటి అసలు మన కీచకుడిగారి గురించి కథలే చెప్పడం లేదూ? నీ ముందు రోజుకో కథ వినేవాళ్ళం." అంది సుమిత్ర.

"కీచకు డెవరూ?" అంది కళ్యాణి అనుమానిస్తూనే.

"ఇంకెవరమ్మా! మీ బాస్! మేమందరమూ అతనికి పెట్టిన ముద్దుపేరు" అంది సుమిత్ర ఆమె అజ్ఞానానికి నవ్వొస్తున్నట్టు.

"అలాగా! కాని-అయనని గురించి చెప్పడానికి కథలేమీ లేవు. కల్పించి చెప్పడానికి నాకు చేతకాదు" అంది కళ్యాణి.

ఇంకా కొంతమందీ ఆ ప్రశ్న మరోలాగా వేశారు.

కళ్యాణి ఆ జవాబే ఇచ్చింది.

"అంత మంచివాడై పోయాడా?" అన్నారు వాళ్లూను. ఆమె చెప్తున్నది నమ్మలేనట్టే చూశారు. కొంత కాలానికి ఆ చూపుల్లో అంతరార్థం తెలిసింది కళ్యాణికి. కాని ఏమిటి చెయ్యడం? అబద్ధం చెప్పడం ఆమెకి అలవాటులేదు. అందులోనూ ఒక ఆఫీసరుని అల్లరి పెట్టే అబద్ధం. అదీకాక అతను తనకి సాయం చేశాడు. చాలా ఓర్పుగా తనతో ప్రవర్తించాడు.

"భుజంమీద చెయ్యివేసి ఫరవాలేదనడం అతనికి మామూలు. తరచూ కరచాలనం చెయ్యడం ఒకటి. మా ఆవిడకి ఈ మధ్య ఒంట్లో ఏమీ బాగాలేదు. ఇంట్లో అసలు సుఖం కాని ఆనందంకాని లేవు అంటాడు. సినిమాకి తీసికెడతానంటాడు. అవన్నీ అతని టెక్నిక్స్. సుశీ అతనికి లొంగిపోయి పీకలమీదికి తెచ్చుకుంది. శ్యామలా, మార్గరెట్, నసీం-ఒకరేమిటి, అందరినీ అల్లరిపెట్టాడు దుర్మార్గుడు. ఎంత సహనం ఉన్న మనిషివో నువ్వు!" అంటూ అపూర్వ గాథలన్నీ స్నేహితులు ఏకరువు పెట్టడం కళ్యాణికి రెండు మూడుసార్లు జరిగింది.

మరో నాలుగైదు నెలల్లో ఆమెకి

స్పష్టమైన విషయం ఏమిటంటే అందరి దృష్టిలో తాను చులకనయి పోయిందని, అతని వలలో పడిపోయి అతన్ని ఏమీ అనకుండా అంతా దాచిపెట్టినట్టు అందరూ నమ్మి ఆమెకి దూరంగా ఉండసాగేరు

ఈ మధ్య కళ్యాణికి రెండు బాధలు.

ఒకనాడు అమ్మ కూడా చూచాయగా "మీ ఆఫీసరెవరో అతనంత మంచివాడు కాదుట కదా! మరో దగ్గిర వేయించుకో కూడదూ?" అంది. ఆమెని క్రాస్ ఎగ్జామిన్ చేసినా "ఇలాటి మాటలు దాగి ఉంటాయటే? బంగారు బొమ్మలాగ ఉన్నావు. ఎవరి కళ్ళుపడినా ఆశ్చర్యం ఏముందీ?" అంది. అంతే.

బంగారు బొమ్మ!

ఇంటికి వొచ్చిన ఏడెనిమిది నెలల్లోనూ కళ్యాణి బాగా తేరుకుంది. అమ్మ సాన్నిధ్యం ఆమెకి అమృతంలాగ ఉంది. మనసుకి హాయిగా ఉంది. శరీరానికీ హాయిగా ఉంది. అద్దంలో ముఖం మాత్రమే చూసుకోగలిగినా సుమిత్రా వాళ్ళూ కళ్యాణిని ఈ మధ్య తెగ మెచ్చుకోవడం వల్ల తనలో దాగిఉన్న ఆకర్షణ బయటికి వొచ్చి కనిపిస్తోందని సరదాగా అనుకుంది కళ్యాణి.

కాని....

అంత గ్రంథకర్త రమేష్ తనకి అంత దూరంగా ఎందుకు ఉంటాడు? ఇన్ని నెలల్లో అతను అతి సామాన్యమైన కాంప్లిమెంటు కూడా ఇవ్వలేదు. వ్యక్తిగతంగా ఒక స్టెనోగా తప్పితే ఒక మనిషిగా వయసులో ఉండి ఆకర్షణ వెదజల్లే యువతిగా అతనెప్పుడూ ఆమెని చూడనైనా చూడలేదు.

ఇరవై రోజుల కిందట జరిగిన విషయం తలుచుకుంది కళ్యాణి. ఆ రోజు లేచేసరికే ఒంట్లో ఎలాగో ఉంది. ఆఫీసుకి వెళ్ళాలనిపించలేదు. కాని నిన్నటి డిక్టేషన్లు బాకీఉండి తప్పక వెళ్ళింది. రెండు దాటేసరికి విపరీతమైన తలనొప్పి.

లీవు లెటరు టైపుచేసి సంతకంపెట్టి పట్టికెళ్ళి రమేష్‌కి ఇచ్చింది. "చాలా తలనొప్పిగా ఉందండీ! జ్వరం అని అనుమానం. ఇంటికి వెళ్ళిపోతాను" అంది.

"సారీ. వెంటనే వెళ్ళండి" అన్నాడు రమేష్.

కీచకుడి మార్కు ప్రేమికులకి అది బంగారు తరుణం అని కళ్యాణికి తెలుసును. జ్వరమా? అని చెయ్యి బుగ్గల మీదా వీలైతే కొంచెం కిందకే వేసి "అరే! చాలా జ్వరంగా ఉందే!" అని మానవత ఉట్టిపడేలాగ అనొచ్చును.

"అటోలో వెళ్ళండి.... లీవు గురించి వర్రీవొద్దు. జాగ్రత్తగా ఉండండి" అని మాత్రం అన్నాడు రమేష్. రెండు రోజుల తరవాత డ్యూటీకి వస్తే మళ్ళీ ఆరోగ్యంమాటే రాలేదు.

అదే కళ్యాణి రెండో బాధ.

అందరూ ఏమన్నా తనలో నిజానికి ఏ ఆకర్షణా లేదేమో అని ఆమె భయం. రోజురోజుకీ ఆ బాధ ఎక్కువ అవుతోంది. సుమిత్ర పొగడ్తలు ఆమెని సంతృప్తి పరచలేదు. అతడు మెచ్చినదే అందం అని ఆమె అనుకోలేదు.

ఆ రోజు....

కళ్యాణి పుట్టిన రోజు. కిందటి సంవత్సరం ఆ రోజు ఎంత ఘోరంగా గడిచిందో జ్ఞాపకం పెట్టుకున్న కళ్యాణి ఈరోజు ఉదయం లేచి తల దువ్వుకుని పూజ చేసుకుని తరవాత ఆఫీసుకి వెళ్ళింది. లంచ్ టైంలో సుమిత్ర కనిపించింది. ఆమెతో కళ కూడా ఉంది.

"ఏమిటి ఈవేళ? కొత్త చీరా కొత్త అందాలూను! ఏమైనా విశేషమా?" అంది సుమిత్ర.

"గాడ్! ఎంతగా మారిపోయావు! ప్రేమలో పడ్డావా? లేక పెళ్ళి చూపులా? గ్లోరియస్!" అంది కళ.

కళ్యాణి నవ్వి ఊరుకుంది. ఉదయం క్షణంమాత్రం రమేష్ ఆమెని పరిశీలించి సంతృప్తిగా నవ్వేడు. అది ఆమెకి చాలా సంతోషం కలిగించింది. వీళ్ళెవరికీ ఏమీ చెప్పాలనిపించలేదు.

ఆ సాయంత్రం కొంత పని తగలడం ఆమెకి మరికొంత సంతోషం అయింది. నాలుగున్నరదాకే డిక్టేట్ చేసి "తొందర లేదులెండి. రేపిస్తే చాలు" అన్నాడు రమేష్.

"ఫరవాలేదు.... రేపు సెలవు కదా! ముగించి వెడతాను" అంది కళ్యాణి మామూలుగా రమేష్ ఏడుదాకా ఆఫీసు వొదలడు.

అతి నిదానంగా పనిచేసి కళ్యాణి ఏడుదాకా మిషను ముందు కూర్చుని టైపు చేసింది. ఏడవగానే రమేష్ బయటికి వొచ్చి ఇంకా అక్కడే కూర్చున్న ఆమెనీ బయటపడుతూన్న వర్షాన్నీ చూసి, "మీ రింకా ఇంటికి వెళ్ళలేదా? అర్జెంటు కాదని చెప్పేను కదా! లీవిట్. గో హోమ్" అన్నాడు లోపలికి వెడుతూ.

కళ్యాణి మరొక్క నిమిషంలో కాగితాలన్నీ ఫోల్డర్‌లో పెట్టి అతని రూంలోకి వెళ్ళి "పని అంతా ముగించాను...." అంది అతన్ని గమనిస్తూ.

"అనవసరంగా శ్రమపడ్డారు- ఎల్లుండి చేస్తే సరిపోయేది" అన్నాడు రమేష్.

"నాకు ఒక సెంటిమెంటు. ప్రతీ ఏడూ పుట్టినరోజు నాడు బాకీలేవీ ఉంచకూడదని. అన్ని బాకీలూ తీరిపోతాయని కాదు—వీలైనన్ని" అంది కళ్యాణి.

"ఇవేళ మీ పుట్టిన రోజా? మెనీ హేపీ రిటన్స్!" అన్నాడు రమేష్.

"థేంక్స్. ఇంక వెడతాను" అంది కళ్యాణి. బయట వర్షపు హోరు ఎక్కువ అయింది.

"గుడ్‌నైట్" అన్నాడు రమేష్.

"గుడ్‌నైట్" అంది కళ్యాణి నీరసంగా. ఈ వర్షంలో ఎలా వెళ్ళడం? ఈ మానవుడు లిఫ్ట్ ఇస్తాడని నమ్మింది. ఆ తలకాయలోకి ఆ ఆలోచన రానేలేదు.

ఇంటికెళ్లేసరికి అమ్మకూడా ఉండదు. చుట్టాలింటికి వెళ్ళి రాత్రి పదికి వొస్తానంది. అక్కడేదో శుభకార్యంట.

కళ్యాణి వీధిలోకి వొచ్చింది. చేతిలోని గొడుగువల్ల ప్రయోజనం ఏమీ లేదు- అంత ఎక్కువగా ఉంది వర్షం. లోలోపలి దుఃఖం క్రమంగా కోపంగా మారి ఆ వేడిలో వర్షం బాధని అంతగా పట్టించుకోలేదు ఆమె.

"రాస్కెల్!" అనుకుంది.

"స్టుపిడ్!"

"ఇడియట్! డబుల్ ఇడియట్!"

ఏమిటి ఆ మనిషిలో లోపం?

లేక తనలో లోపం ఉందా?

ఉండి ఉండాలి. లేకపోతే మరీ అలాగ దున్నపోతులాగా ఆ మనిషి ఎలాగ ఉండిపోగలిగాడు?

బస్సులు లేవు

ఆటోలు తిరగడం లేదు....

ఆమెకి కోపం ఎక్కువౌతోంది. అతని మీద. ప్రపంచం మీద.

లైట్లు-కారులైట్లు. ఆమె ముందు ఆగాయి.

రమేష్.

ఆమె ప్రాణం లేచివొచ్చింది.

"ఆటో దొరకలేదా?" అన్నాడు వర్షపు జల్లులో నించి

"లేదండీ!" అంది కళ్యాణి.

"కమిన్" అన్నాడు.

"మీకు శ్రమ-అలక్ష్యం అవుతుంది" అంది కళ్యాణి.

"ఫరవాలేదు.రండి"

ఆమె సంకోచంతో కారులో కూర్చుంది. వేడి కాఫీ తాగాలనీ అతనితో మాటలాడి కాలం గడపాలనీ ఉందామెకి.

"ఎక్కడ మీ ఇల్లు?"

"బసంత్‌నగర్‌లో...."

"ఎక్కడ?"



డాక్టరు చాలా తక్కువ తిన మన్నాడు! అంచేత యీ కంచంలో తింటున్నాను!!

అతను వేగంగా కారు నడుపుతూంటే ఆమె వివరాలు చెప్పింది. అతని చూపులు రోడ్ మీదనే ఉన్నాయి.

పది నిముషాలలో ఆమె ఇంటి ఎదురుగా కారు నిలిపి, "ఇదేనా మీ ఇల్లు?" అన్నాడు.

"అవును. లోపలికి రండి.... వేడిగా కాఫీ తాగి వెళ్దురుగాని" అంది కళ్యాణి అంత ఆశ లేకపోయినా.

"వొద్దండీ! ఇంట్లో ఆవిడ ఎదురు చూస్తోంది. ఆవిడ బర్త్‌డే కూడా ఇవాళే! వెళ్లాలి" అన్నాడు రమేష్.

"కాఫీకి నాలుగు నిముషాల కన్నా పట్టదు. ఇంట్లో ఎవరూ లేరు-మీరైనా ఉంటే బాగుంటుంది...." అంది కళ్యాణి బాధ దాచుకుంటూ.

"సారీ!....వొచ్చే సారి మీ బర్త్‌డేకి వొస్తాను-ఆ మైగాడ్ మీ ఇద్దరి జన్మదినాలూ ఒకే రోజు రాకపోతే గుడ్ నైట్" అన్నాడు రమేష్. కళ్యాణి దిగడమేమిటి కారు కదలడమేమిటి, రోడ్డు మీద బురద నీళ్లు ఆమె మీద పడింది.

ఈ సారి కళ్యాణికి కోపం వొచ్చింది కన్నీళ్ళు కూడా వొచ్చాయి. కాని ముఖం మీది వర్షపు నీటిలో కలిసి పోయాయి.

ఇంటి తాళం తీస్తూ మళ్లీ రమేష్‌ని శపించింది కళ్యాణి.

వెంటనే పోస్టింగ్ మార్పించుకునే నిర్ణయం తీసుకుని బట్టలు మార్చుకునే ప్రయత్నం మొదలుపెట్టింది కళ్యాణి. కోపంగా.

చాలా కోపంగా. కాని ఆమెకి బయట వర్షంలో ఏమి జరుగుతుందో తెలీదు. కారులో వెళతూ మేనేజిమెంటు తనకి ఇచ్చిన చివరి వార్నింగ్ తలుచుకుని ఆ వర్షంలో స్పీడుగా వెళుతూన్న కారులో కూర్చున్న రమేష్‌కి కన్నీళ్ళు పర్యంతం అయింది. మరొక్కసారి ఏ అమ్మాయితోనైనా సరే ఏ పరిస్థితుల్లోనయినా సరే ఎఫయిర్ మొదలుపెడితే వెంటనే ఉద్యోగం పోతుందని వాళ్ళు వాగ్దానం చేశారు. ఇంట్లో ధర్మపత్ని కూడా ఇంకేమైనా వదంతి మాత్రం విన్నా తను కాపురం సరి అని సర్వదేవతల సాక్షిగా ప్రమాణంచేసింది అదే జ్ఞాపకం వొచ్చి రమేష్ చెయ్యిజారిన తియ్యటి అవకాశాన్ని తలుచుని తలుచుకుని కుమిలి పోతూ కారుని మరింత స్పీడుగా పోనిచ్చాడు.

కాని ఆమేకేం తెలుసును?

అందుకే అంత కోపం పాపం!